బీఆర్ఎస్ మైనార్టీ విభాగం మండల అధ్యక్షుడు జమీర్‌ఖాన్ ఆధ్వర్యంలో గుండారం గ్రామ మైనార్టీ పెద్దలు మంగళవారం జిల్లాకేంద్రంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పలు సమస్యలపై బాజిరెడ్డితో చర్చించారు. గుండారం గ్రామ మసీదు కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖదీర్, వైస్‌చైర్మన్ అఫ్జల్‌ఖాన్, సభ్యులు లాయక్, మైనార్టీ పెద్దలు షేక్ పాషా, సయ్యద్ సోఫియాన్, షేక్ ఫర్హీన్ ఉన్నారు. -సారంగాపూర్, అక్టోబర్ 1

టీయూలోని సమస్యలు పరిష్కరించండి

రిజిస్ట్రార్‌కు ఎన్ఎస్‌యూఐ వినతి

డిచ్‌పల్లి, అక్టోబర్ 1 : తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వర్సిటీ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు బానోత్ సాగర్‌నాయక్ ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాగర్‌నాయక్ మాట్లాడుతూ.. హాస్టల్ గదుల్లో ఫ్యాన్లు, కిటికీ మెష్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. హాస్టల్ పరిసర ప్రాంతాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలన్నారు. క్యాంపస్‌లో రాత్రిపూట వీధి దీపాలు వెలగడం లేదని, విద్యార్థులు రాత్రివేళల్లో లైబ్రరీకి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎన్ఎస్‌యూఐ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు హరీశ్, సందీప్, రాజేంద్రప్రసాద్, దేవేందర్, చందర్ రాథోడ్ తదితరులున్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

కోటగిరి, అక్టోబర్ 1: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో చందర్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ సమావేశపు హాల్‌లో కార్యదర్శులతో పలు అంశాలపై సమీక్షించారు. తాగునీటి సరఫరా, పైప్‌లైన్ లీకేజీలు, పారిశుద్ధ్యం తదితర వాటిపై చర్చించి సూచనలు చేశారు. ప్రజలకు కార్యదర్శులు అందుబాటులో ఉండాలని సూచించారు.

దోమల నివారణ మందు పిచికారీ చేయాలి

ధర్పల్లి, అక్టోబర్ 1: గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు లార్వా దశలోనే వాటిని నాశనం చేసేలా గ్రామపంచాయతీలకు అందించిన మందులను పిచికారీ చేయాలని ఎంపీడీవో బాలకృష్ణ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామపంచాయతీల కార్యదర్శులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బుధవారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి గ్రామసభలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం దోమల నివారణ మందులను అన్ని గ్రామపంచాయతీలకు పంపిణీ చేశారు. ఇన్‌చార్జి ఎంపీవో, ఏపీవో వినోద పాల్గొన్నారు.

'ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నాం'

కంఠేశ్వర్, అక్టోబర్1: బీజేపీ నాయకులు ఏదైనా మాట్లాడేముందు ఆ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తుంచుకొని మాట్లాడాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడిఉన్నదని, ప్రతిఒక్క హామీని నెరవేరుస్తుందని స్పష్టం చేశారు. ఏ ఒక్క హామీ నెరవేర్చని బీజేపీ ప్రభుత్వం, ఆ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. ఈ నెల 4న పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ మొదటిసారి జిల్లాకు వస్తున్న సందర్భంగా నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా 'ప్రపంచ వృద్ధుల దినోత్సవం'

- జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ
- వయోవృద్ధులకు సన్మానం

కంఠేశ్వర్, అక్టోబర్ 1: జిల్లా కేంద్రంలో మంగళవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాత కలెక్టరేట్ నుంచి రాజీవ్‌గాంధీ ఆడిటోరియం వరకు వివిధ పాఠశాలల విద్యార్థులు, వయో వృద్ధులతో అవగాహన ర్యాలీ చేపట్టగా.. ర్యాలీని జిల్లా జడ్జి సునీత కుంచాల జెండా ఊపి ప్రారంభించారు.అనంతరం న్యూ అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నగర మేయర్ నీతూ కిరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాంపూర్ గ్రామంలో ప్రభుత్వం తరపున నూతన వృద్ధాశ్రమం నిర్మించారని, త్వరలో ప్రారంభిస్తారని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఆంజనేయులు తెలిపారు. అనంతరం వయోవృద్ధులు, రైతులు, సైనికులను ముఖ్య అతిథులు చేతులమీదుగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీ, మహిళా కమిషన్ మెంబర్ సూదం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

వృద్ధులను సన్మానించిన నగర మేయర్ నీతూకిరణ్

రఘునాథ చెరువును పరిశీలించిన కమిషనర్

జిల్లా కేంద్రంలోని రఘునాథ చెరువు, మినీ ట్యాంక్ బండ్ ప్రాంతాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్ మంగళవారం పరిశీలించారు. దసరా, బతుకమ్మ పండుగల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట కార్పొరేషన్ సిబ్బంది ఉన్నారు. -కంఠేశ్వర్,అక్టోబర్ 1

డిచ్‌పల్లిలో ఆర్‌యూబీ నిర్మాణానికి స్థల పరిశీలన

డిచ్‌పల్లి, అక్టోబర్ 1 : డిచ్‌పల్లి-ఘన్‌పూర్ గ్రామాల మధ్య రైల్వేగేటు వద్ద ఆర్‌యూబీ (రైల్వే అండర్ బ్రిడ్జి వంతెన) నిర్మాణం కోసం రైల్వే, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, పోలీసు శాఖాధికారులు మంగళవారం పరిశీలించారు. రానున్న రోజుల్లో రైళ్ల రాకపోకల సంఖ్య పెరిగే అవకాశం ఉండడం, వాహనదారుల ఇబ్బందులను తొలగించడానికి ఆర్‌యూబీ నిర్మించనున్నారు. ఆర్‌యూబీ నిర్మించాలని గతేడాది నడ్పల్లి పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి వినతిపత్రం సమర్పించింది.

ఇందల్వాయి రైల్వే బ్రిడ్జి, గేట్లు..

ఇందల్వాయి, అక్టోబర్ 1 : ఇందల్వాయి రైల్వేస్టేషన్‌తో పాటు ధర్పల్లి, సిర్నాపల్లి మార్గంలో ఉన్న రైల్వే గేట్లను రైల్వే, రోడ్లు, భవనాలు, పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు పరిశీలించారు. సిర్నాపల్లి రైల్వేస్టేషన్‌లో అండర్ బ్రిడ్జి, ఇందల్వాయి గేటు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. ఈ రైల్వే గేట్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ వెంకట్‌రావు, ఆర్ఐ మోహన్ ఉన్నారు.

నేటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో బతుకమ్మ వేడుకలు

కోటగిరి, అక్టోబర్ 1: జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నేటి నుంచి బతుకమ్మ వేడుకలను నిర్వహించనున్నారు. ఈ మేరకు హైదరాబాద్ ఐసీడీఎస్ కమిషన్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా ఐసీడీఎస్ కార్యాలయానికి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈనెల 2 నుంచి 12వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో బతుకమ్మ సంబురాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చిన్నారులకు పాఠాలు, పౌష్టికాహారం అందించాలని, అనంతరం బతుకమ్మ సంబురాలు నిర్వహించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

జగన్మాత కొలువుదీరనున్న వేళ

రేపటి నుంచి దేవి నవరాత్రి ఉత్సవాలు

సుభాష్‌నగర్, అక్టోబర్ 1: దేవీ నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 3 నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ సందర్భంగా మండపాలను నిర్వాహకులు అందంగా ముస్తాబు చేస్తున్నారు. మంగళవారం జిల్లా కేంద్రానికి మండపాల నిర్వాహకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి విగ్రహాలను కొనుగోలుచేశారు. దీంతో విగ్రహాలు అమ్ముతున్న వర్ని చౌరస్తా, పులాంగ్ చౌరస్తా, కంఠేశ్వర్ బైపాస్ తదితర ప్రాంతాలు సందడిగా మారాయి. జిల్లా కేంద్రంలో సుమారు వందకుపైగా దుర్గా మండపాలను ఏర్పాటుచేస్తున్నట్లు నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

బోధన్‌రూరల్ 1: బోధన్ మండలంలోని రాజీవ్‌నగర్ తండా గ్రామ శివారులో సోమవారం రాత్రి దుండగులు 25 కేవీ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసినట్లు విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేస్తుండగా గ్రామస్తులు గమనించారు. అక్కడికి చేరుకునేలోగా దుండగులు పారిపోయారని విద్యుత్ శాఖ అధికారులు సత్యనారాయణ, వెంకటేశం తెలిపారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

వినాయక్‌నగర్, అక్టోబర్ 1: జిల్లా కేంద్రంలోని దోబిగల్లీ ప్రాంతానికి చెందిన సరస్వతి(33) మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడింది. కొంత కాలంగా తరుచూ మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న ఆమె సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కాలనీ వాసులు గమనించి ఆమె భర్తకు సమాచారం అందించారు. దీంతో ఆమెను ప్రభుత్వ దవాఖానకు తరలించగా పరీక్షించి వైద్యులు అప్పటికే మరణించినట్లుగా నిర్ధారించారు. మృతురాలి భర్త నరేశ్ ఫిర్యాదు మేరకు రెండో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి,దర్యాప్తు చేపట్టారు.

రైల్వే స్టేషన్‌లో వ్యక్తి అదృశ్యం

సయ్యద్ మౌలానా

వినాయక్‌నగర్, అక్టోబర్ 1: నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. పోతంగల్ గ్రామానికి చెందిన సయ్యద్ మౌలానా(53) భార్యతో కలిసి నెల్లూరు నుంచి నిజామాబాద్‌కు కృష్ణాఎక్స్‌ప్రెస్‌లో మంగళవారం తెల్లవాజామున వచ్చారు. అనంతరం వారు ప్లాట్‌ఫాంపై నిద్రిస్తుండగా మధ్యలో లేచి సయ్యద్ మౌలానా ఎక్కడికో వెళ్లిపోయాడు. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సదరు వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 87126-58591 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

రుద్రూర్‌లో మహిళ ..

లిఖిత

రుద్రూర్, అక్టోబర్ 1: మండల కేంద్రానికి చెందిన దక్క లిఖిత (30) అదృశ్యమైనట్లు పోలీసులు మంగళవారంతెలిపారు. లిఖిత అంబంగల్లీలో తన భర్తతో నివసిస్తోంది. సోమవారం ఉదయం మార్కెట్‌కు వెళ్లి మధ్యాహ్నం వచ్చి చూసే సరికి తన భార్య కనబడకపోవడంతో భర్త ప్రభాకర్ చుట్టుపక్కల వెతికాడు. బంధువులకు ఫోన్ చేసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

సంక్షిప్తంగా..

- **సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం** -వేల్పూర్, అక్టోబర్ 1: రైతులు సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి అన్నారు. మంగళవారం వేల్పూర్ ఎక్స్ రోడ్డులోని మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సోయాబీన్ క్వింటాలుకు రూ.4,982 మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, నర్సారెడ్డి, నరేందర్, గంగాధర్ పాల్గొన్నారు.
- **రేపు ఫుట్‌బాల్ పోటీలు:** కంఠేశ్వర్, అక్టోబర్ 1: జిల్లా కేంద్రంలోని నాగారం రాజారాం స్టేడియంలో ఈ నెల3న అండర్ -19 విభాగంలో బాలురకు ఫుట్‌బాల్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు డీఐఈవో రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని, మరిన్ని వివరాలకు పీడీ ప్రసాద్ 9441631631 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.
- **పారిశుద్ధ్యంపై అవగాహన:** కంఠేశ్వర్,అక్టోబర్ 1: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నగరంలోని అమరవీరుల పార్క్ వద్ద రిలయన్స్ గ్రూప్ ఉద్యోగుల ఆధ్వర్యంలో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం మూడో డివిజన్‌లో శ్రమదానం చేశారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నేటితో ముగియనున్న సందర్భంగా మున్సిపల్ అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్ పాత కలెక్టరేట్ గ్రౌండ్‌ను మంగళవారం పరిశీలించారు.
- **ధర్పల్లిలో ఇసుక వేలం:** ధర్పల్లి, అక్టోబర్ 1: మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో ఇసుక డంప్‌ను మంగళవారం వేలం వేశారు. మండలంలోని దుబ్బాక గ్రామపరిధిలో సుమారు 55 ట్రిప్పుల ఇసుక డంపులను సీజ్ చేయగా, మంగళవారం వేలం నిర్వహించారు. వేలంలో నలుగురు పాల్గొనగా దుబ్బాకకు చెందిన ఒకరు రూ.72 వేలకు దక్కించుకున్నట్లు తహసీల్దార్ మాలతి తెలిపారు.
- **అమ్మ ఆదర్శ పనులను త్వరగా పూర్తిచేయాలి:** కోటగిరి, అక్టోబర్ 1: మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న అమ్మ అదర్శ పాఠశాల పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ నివర్తి అన్నారు. మంగళవారం ఎత్తొండతోపాటు ఆయా గ్రామాల్లో పర్యటించారు. వారి వెంట ఎంపీవో చందర్, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.
- **ప్రభుత్వ పాఠశాలలో బిస్కెట్ల పంపిణీ:** రుద్రూర్, అక్టోబర్1: మండలంలోని అంబం, చిక్కడ్‌పల్లి గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం చాక్లెట్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ రుద్రూర్ అధ్యక్షుడు కేవీ మోహన్, ప్రతినిధులు శ్యామ్ సుందర్ పహాడే తదితరులు పాల్గొన్నారు.
- **నగరవాసులకు నాణ్యమైన విద్యుత్ :** ఖలీల్‌వాడి, అక్టోబర్ 1: నగరవాసులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నట్లు ఎస్ఈ తోట రాజశేఖర్ మంగళవారం తెలిపారు. కంఠేశ్వర్, విద్యుత్‌నగర్, హౌసింగ్‌బోర్డు కాలనీ, మారుతినగర్, తారకరామానగర్, హైదరాబాద్ బైపాస్ రోడ్డు, ఆర్మూర్ రోడ్డు, చంద్రశేఖర్ కాలనీ, బంగారు మైసమ్మ, కస్తూరి గార్డెన్స్ డాక్టర్ కాలనీ, హనుమాన్, కంఠేశ్వర్ హౌసింగ్ బోర్డు ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించటానికి రూ.80 లక్షల వ్యయంతో కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.
- **ఎస్సైకి సన్మానం-** మాక్లూర్, అక్టోబర్ 1: స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఇటీవల వచ్చిన ఎస్సై రాజశేఖర్‌ను బీఆర్ఎస్ నాయకులు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో సుక్కి సుధాకర్, నర్సాగౌడ్, మాజీ సర్పంచులు గంగాధర్, పోశెట్టి, మచ్చర్ల రమేశ్, బండారు రమేశ్, శంసాన్, ప్రకాశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శికి..- ముప్కాల్, అక్టోబర్ 1: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ముప్కాల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్లేశ్ యాదవ్‌ను మంగళవారం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కలిసి సన్మానించారు. పార్టీ సీనియర్ నాయకులు సామ వెంటక్ రెడి, మాజీ ఉప సర్పంచ్ కట్ట మహేశ్, సంజీవ్, రఫీ, కారోబార్ తాహీర్ పాల్గొన్నారు.

- **క్రీడా సామగ్రి, డెస్క్‌బెంచీల వితరణ-** ఏర్గట్ల, అక్టోబర్ 1: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ జావిద్, వీడీసీ సభ్యులు ప్రకాశ్, అంబటి రాజేశ్వర్ అన్నారు. తడ్‌పాకల్ జడ్పీ ఉన్నత పాఠశాలకు విద్యావేత్త, చిట్టాపూర్‌కు చెందిన ఏనుగు దయానంద్‌రెడ్డి రూ.60వేల విలువ గల వాలీ బాల్స్, ఖోఖో పోల్స్, క్రీడా దుస్తులతోపాటు లక్ష రూపాయల విలువ గల 25 డెస్క్ బెంచీలను అందజేశారని తెలిపారు. క్రీడా సామగ్రితోపాటు డెస్క్ బెంచీలను అందజేసిన దయానంద్‌రెడ్డికి, సహకరించిన పీడీలు ఆనంద్, రాజ్‌కుమార్‌కు ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు సాలూర, హున్సాల్లో సోయా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

హున్సాలో సోయా కల్లాన్ని పరిశీలిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్, అక్టోబర్ 1: సాలూర మండలం సాలూర, హున్సా గ్రామాల్లో సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం సాలూర మండల కేంద్రంతో పాటు ఖాజాపూర్, హున్సా గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో సోయా పంట కల్లాలు, కుప్పలను పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడారు. సాలూర, హున్సా గ్రామాల్లో గురువారం సోయా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి హాజరవుతారని తెలిపారు. సోయా మద్దతు ధర రూ.4,892 ఉందని అన్నారు. ఆయన వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బోధన్ ఏఎంసీ వైస్ చైర్మన్ చీల శంకర్, మాజీ ఏఎంసీ చైర్మన్లు బి.గంగాశంకర్, పాషా మొయినుద్దీన్ తదితరులు ఉన్నారు.

డీఎస్సీ జిల్లా థర్డ్ ర్యాంకర్‌కు ఎమ్మెల్యే సన్మానం

సోమవారం వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ఎస్‌జీటీ తెలుగు మీడియంలో జిల్లాస్థాయిలో మూడో ర్యాంక్ సాధించిన సాలూర మండల కేంద్రానికి చెందిన యాచారం గగన్‌ను ఎమ్మెల్యే సదర్శన్‌రెడ్డి సన్మానించారు.

గోశాల నుంచి ఆవుల చోరీకి యత్నం

శక్కర్‌నగర్, అక్టోబర్ 1:బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివమందిరం వద్ద ఉన్న ఏకచక్రేశ్వర గోశాల నుంచి సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు గోవుల చోరీకి యత్నించారు. విద్యుత్ సరఫరాను నిలిపివేసి, ఆవులకు మత్తు మందు ఇచ్చి వాటిని తరలించే క్రమంలో అలికిడి కావడంతో కాలనీకి చెందిన పలువురు నిద్రనుంచి మేల్కొన్నారు. వారిని గుర్తించేలోపు దుండుగులు సంఘటనా స్థలం నుంచి పరారయ్యారు. గోశాల నిర్వాహకులు మంగళవారం ఉదయం గోవులకు వైద్య చికిత్సలు చేయించారు. గోవుల చోరీకి పాల్పడే దుండగులు ముందుగానే వాటికి మత్తుమందు ఇచ్చి వారితో తెచ్చుకున్న వాహనంలో గోవులను తరలిస్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులను వివరణ కోరగా, తమకు ఫిర్యాదు అందలేదని బోధన్ పోలీసులు వెల్లడించారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే వేముల పరామర్శ

తడ్‌పాకల్‌లో బీఆర్ఎస్ నాయకుడు అశోక్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ఏర్గట్ల/వేల్పూర్, అక్టోబర్ 1: బాల్కొండ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఏర్గట్ల మండలంలోని తడ్‌పాకల్‌కు చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు అశోక్ సతీమణి శుష్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా అశోక్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు ఎనుగందుల రాజాపూర్ణానందం, మాజీ ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు జక్కని మధుసూదన్, మాజీ కో-ఆప్షన్ మెంబర్ అస్రాప్, మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్ పత్తిరెడ్డి ప్రకాశ్ రెడ్డి, లోలపు అశోక్, పార్టీ మండల ప్రధానకార్యదర్శి బద్దం శ్రీనివాస్ రెడ్డి, పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలో పలు బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. బాల్కొండలో ఖాదర్ కుటుంబ సభ్యులకు రూ.పది వేల ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల చిట్టాపూర్‌కు చెందిన బాలుడు కచ్చు రాకేశ్ హత్యకు గురికాగా బాధిత కుటుంబాన్ని, కిసాన్‌నగర్‌కు చెందిన శంకర్ పంతులు భార్య కాలం చేయడంతో, మాజీ సర్పంచ్ బూస నరహరి అన్న కాలం చేయడంతో ఆ కుటుంబాలను పరామర్శించారు.

ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబురాలు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, అక్టోబర్1: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు బతుకమ్మ ఆట, పాటలతో హోరెత్తించారు. అనంతరం బతుకమ్మలను సమీప చెరువులు, కుంటలు, వాగుల్లో నిమజ్జనం చేశారు.

తిమ్మాపూర్ ఉన్నతపాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మాక్లూర్ మండలం చిన్నాపూర్ పాఠశాలలో..

రెంజల్ మోడల్ స్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

బోధన్‌లోని శ్రీ విజయసాయి హైస్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉపాధ్యాయులు



కోటగిరి జూనియర్ కళాశాలలో ..

బొప్పాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ..

పొతంగల్ జడ్పీహెచ్ఎస్‌లో..

సంక్షిప్తంగా..

- **ఎమ్మెల్యే వేములకు సన్మానం -** వేల్పూర్, అక్టోబర్ 1: పీఆర్టీయూ టీఎస్ వేల్పూర్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.దేవానందం, సీవీ నర్సింహారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో కలిసి కార్యవర్గాన్ని పరిచయం చేశారు. నూతన విద్యాశాఖాధికారిగా నియమితులైన టి.రేణుకను పరిచయం చేశారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు. పాఠశాలలో నూతన గదుల నిర్మాణంపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.
- **ఫ్రెషర్స్ పార్టీ -** బాల్కొండ, అక్టోబర్ 1: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రజీయొద్దీన్ అస్లాం తెలిపారు. ముఖ్యఅతిథిగా డీఐఈవో రవికుమార్ హాజరై మాట్లాడారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.
- **వైద్య శిబిరం** -బాల్కొండ, అక్టోబర్ 1: కిసాననగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో చిట్టాపూర్ గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు స్రవంతి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.
- **రెంజల్ ఇన్‌చార్జి ఏవోగా సిద్ధి రామేశ్వర్-** రెంజల్, అక్టోబర్ 1: మండల వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి అధికారిగా ఎడపల్లి ఏవో సిద్ధి రామేశ్వర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజెద్‌హుస్సేన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెంజల్ ఏవోగా డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న లక్ష్మీకాంత్‌రెడ్డిని బుసార పరీక్ష కేంద్రం బోధన్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.
- **గురుకుల విద్యార్థినికి ఎంబీబీఎస్ సీటు -** ఎడపల్లి, అక్టోబర్ 1:మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో విద్యను అభ్యసించిన కె.నిఖిత ఎంబీబీఎస్ సీటు సాధించింది. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.గంగాశంకర్‌తో పాటు ఉపాధ్యాయులు విద్యార్థిని మంగళవారం అభినందించారు.
- **ముగిసిన శిక్షణ-** రెంజల్/బాల్కొండ, అక్టోబర్ 1: మండల కేంద్రంలోని గత నెల 27న ప్రారంభమైన రెంజల్, ఎడపల్లి మండలాల గ్రామ తాగునీటి సహాయకులకు శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. శిక్షణ పొందిన వారికి ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రాజేందర్ సర్టిఫికెట్లను అందజేశారు. ఉమ్మడి బాల్కొండ మండలానికి చెందిన సహాయకులకు శిక్షణ ముగిసింది. చివరి రోజున శిక్షణలో పాల్గొన్న సహాయకులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. డీఈ అమీర్‌ఖాన్, ఏఈ సమీర్, బస్వరాజ్‌లు పాల్గొన్నారు.
- **అంతరాలు లేని సమాజం కోసం పోరాడాలి-** మోర్తాడ్, అక్టోబర్ 1: జ్యోతిరావుపూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకుని అంతరాలు లేని సమాజనిర్మాణం కోసం పోరాటం చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్‌డివిజన్ నాయకుడు కిషన్, కమ్మర్‌పల్లి మండల కార్యదర్శి అశోక్ అన్నారు. మహాత్మ జ్యోతిరావుపూలే సత్యశోధక్ సమాజ్ ఏర్పాటు చేసి 152 ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దోన్‌పాల్ మాజీ సర్పంచ్ పోసాని, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.
- **సామాజిక సేవలు అభినందనీయం-** ఎడపల్లి, అక్టోబర్ 1: రెండు రోజులుగా కొనసాగుతున్న స్థానిక సాయిబాబా ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు మల్లాది వెంకటేశ్వరశర్మ సేవలకు గాను ఆయనను కొనియాడారు. ఎడపల్లిలోని బాలికల గురుకుల పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి వెంకటేశ్వరశర్మ చేసిన సాయం మరువలేనిదని అన్నారు.
- **ఆర్టీసీ కార్గో సేవలపై అవగాహన -** ఆర్మూర్‌టౌన్, అక్టోబర్1: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కార్గో సేవలపై మంగళవారం ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. తక్కువ ధరలకే ఆర్టీసీ అందిస్తున్న కార్గో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, కార్గో సిబ్బంది పాల్గొన్నారు.
- **డివైడర్ ధ్వంసం-** ముప్కాల్, అక్టోబర్ 1: సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పాత జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను జేసీబీతో ధ్వంసం చేశారని సీఐ శ్రీధర్‌రెడ్డి అన్నారు. ధ్వంసమైన డివైడర్‌ను మంగళవారం ఆర్‌అండ్‌బీ ఏఈ ప్రమీలతో కలిసి పరిశీలించారు. డివైడర్ మధ్యలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ధ్వంసం చేయడం సరికాదని అన్నారు. ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నామోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ పాల్గొన్నారు.
- **ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి -** శక్కర్‌నగర్, అక్టోబర్ 1: ఆటోల యజమానులు, డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బోధన్ ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ సూచించారు. బోధన్ పట్టణంలో ఆటో యూనియన్ నాయకులు, యజమానులు, డ్రైవర్లతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు.
- **బైకుల చోరీ నిందితుల రిమాండ్ -** శక్కర్‌నగర్, అక్టోబర్ 1: బోధన్ పట్టణంలోని రెండు వేర్వేరు ప్రాంతాల నుంచి ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. రాకాసీపేట్ ప్రాంతానికి చెందిన అబ్బు, గోశాలరోడ్‌కు చెందిన గౌస్ ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడినట్లు కాలనీకి చెందిన వాహన యజమానులు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించి, మంగళవారం రిమాండ్‌కు పంపారు.
- **ఆహ్వాన పత్రం అందజేత-** శక్కర్‌నగర్, అక్టోబర్ 1:బోధన్ పట్టణం శక్కర్‌నగర్ రామాలయంలో 11న అమ్మవారి మండపం వద్ద నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఉత్సవ కమిటీ ప్రతినిధులు బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డికి మంగళవారం నిజామాబాద్‌లోని ఆయన నివాసంలో ఆహ్వాన పత్రం అందించారు.
- **కొనసాగుతున్న ఇన్‌ఫ్లో-** మోర్తాడ్, అక్టోబర్ 1: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం ప్రాజెక్ట్‌లోకి 40,604క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్ట్ ఆరు గేట్లు ఎత్తి 18,744 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, RACCA RAVINDHAR (Old name) Changed My name & Surname as RACHA RAVINDHER (New Name) R/O H.no: 12-30 Vill & Mdl: Morthad Dist: Nizamabad .T.G.
NTZ-334755

CHANGE OF NAME
I,RACHHA MANJULA (Old name) Changed My Surname as RACHA MANJULA W/o RACHA RAVINDHER, R/o H.no: 12-30, Vill & Mdl: Morthad,Dist: Nizamabad .T.G.
NTZ-334755

CHANGE OF NAME
I, RACHHA SHANTAN (Old name) Changed My name & Surname as RACHA SHANTHAN (New Name) S/o RACHA RAVINDHER, R/o H.no: 12-30, Vill & Mdl: Morthad, Dist: Nizamabad .T.G.
NTZ-334754

CHANGE OF NAME
I,JAYA KUMARI.G (Old Name) D/o.GATLA SATYANARAYANA Changed my name as JAYA POLAKAM W/o SURESH POLKAM R/o Flot no 202 A Block, Subhishi Gautami, Beside: cineplanet kompally. VTC: Qutubullapur, Po: Kompally, Sub Dist: Dundigal, Gandimisamma, Dist: Medchal Malkajgiri, T.G.
NTZ-334753

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.